క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మండలంలోని ఉండూరు, వీకే రాయపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట సబ్ స్టేషన్‌లో 11 కేవీ డీఎస్‌ఏ ఫీడర్లు, లైన్ మరమ్మతుల్లో భాగంగా ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: పట్టణంలోని 13వ వార్డు తెలుకుల పుంతలో డ్రైన్, కల్వర్టు నిర్మాణానికి వార్డు సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. దీర్ఘకాల సమస్యగా ఉన్న డ్రైన్, కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీకి మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ పనులు చేయడానికి కౌన్సిల్ ఆమోదం లభించిందని హరిబాబు తెలిపారు.

రైలు ప్రయాణికుడి బంగారు గొలుసు చోరీ

సామర్లకోట: హైదరాబాద్ నుంచి బుధవారం సామర్లకోటకు ప్రత్యేక రైలులో చేరుకున్న ప్రయాణికుడి మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన షేక్ గంగా సాహెబ్, కుటుంబ సమేతంగా లింగంపల్లి నుంచి స్పెషల్ ట్రైన్‌లో జనరల్ బోగీలో ప్రయాణించారు. రాజమహేంద్రవరం వచ్చాక బ్రష్ చేసుకునే సమయంలో చూసేసరికి మెడలో గొలుసు కనిపించలేదు. తులం బంగారు గొలుసు విలువ రూ.80 వేలు ఉంటుంది. ఈ మేరకు బుధవారం సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



ఉండూరులో పొలంబడి నిర్వహిస్తున్న ఏవో మురళీధర్

సామర్లకోట: రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి పొలంబడి కార్యక్రమం దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ అన్నారు. గురువారం ఉండూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, మిత్ర పురుగులను రక్షించుకుని, ఆరోగ్యమైన పంట పండించడానికి రైతులు ప్రతి రోజు పొలాన్ని పరిశీలించాలని సూచించారు. పంటకు హాని కలిగించే పురుగుల నివారణకు మందులు వాడాలన్నారు. రైతుల అనుమానాలను పొలంబడిలో నివృత్తి చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. విత్తన శుద్ధి వల్ల అధిక ఎరువుల వాడకం తగ్గి, తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు. జీవన ఎరువులను రైతులు అలవాటు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ చార్జీలపై పోరాటం



విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: విద్యుత్ ఉద్యమ అమర వీరుల స్ఫూర్తితో చార్జీలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు పిలుపునిచ్చారు. విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ గురువారం స్థానిక మున్సిపల్ సెంటర్‌లో పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నీలపాల మాట్లాడుతూ, ప్రధాని మోదీ, బాబు అదానితో కలిసి ప్రజలపై స్మార్ట్ మీటర్లతో పాటు, ట్రూ ఆఫ్ చార్జీలు పెంచిందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలుత విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలాస్వామి చిత్రపటాలకు సూరిబాబు, చింతల సత్యనారాయణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.సత్యనారాయణ, డి.కృష్ణ, సిరిపురపు మరిడయ్య, కూనిరెడ్డి అప్పన్న, యాలనపు రమేష్, మహాపాతిన రాంబాబు, గూనూరి రమణ, తైనాల శ్రీను, తాడిశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

జారిపడితే అంతే..!

- ఫుట్‌బోర్డుపై వేలాడుతూ విద్యార్థుల నిత్య ప్రయాణం
- ప్రాణాంతకంగా మారుతున్న ఫీట్లు
- బస్సు ఖాళీగా ఉన్నా పట్టించుకోని వైనం
- విద్యాసంస్థల వేళల్లో అదనపు బస్సులకు డిమాండ్



సామర్లకోట-రాజమహేంద్రవరం బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

సామర్లకోట: వివిధ కార్పొరేట్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతి రోజు బస్సుల్లో వేలాడుతూ ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. వీరు ఏ మాత్రం ఆజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిసీ ప్రయాణాలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. రాజమహేంద్రవరం రోడ్డు, ఏడీబీ రోడ్డు, ప్రత్తిపాడు రోడ్లలో ఉన్న వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం సామర్లకోట బస్ కాంప్లెక్స్‌లో బస్సులు ఎక్కుతుంటారు. దీంతో సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం, ఏలేశ్వరం వెళ్లే బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చిన విద్యార్థులూ ఆయా కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు.

ఉచిత బస్సుల కారణంగా..

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆయా రూట్లలో బస్సులు మరింత రద్దీగా ఉంటున్నాయి. అదే సమయంలో వివిధ కార్యాలయాలకు వెళ్లే వారు కూడా బస్సులు ఎక్కడంతో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రాజమహేంద్రవరం, ఏలేశ్వరం వెళ్లే బస్సులు రద్దీగా ఉంటాయి. విద్యార్థులు బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. లోపల ఖాళీగా ఉన్నా.. గేటులోనే వేలాడుతున్నారు. కొన్ని సమయాల్లో కండక్టర్‌కు వారి వద్ద బస్ పాస్‌లున్నాయో లేదో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. దాంతో బస్సును ప్రయాణం మధ్యలోనే ఆపి, పాస్‌లు చెక్ చేయాల్సి వస్తోంది. ఖాళీగా ఉన్న బస్సులను ఎక్కకుండా, విద్యార్థులంతా ఒకేసారి ఎక్కడం వల్ల వేలాడుతూనే ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తుండడం కనిపిస్తోంది. బస్సు కాంప్లెక్స్‌లో పోలీసు అవుట్ పోస్టు ఉండటం వల్ల విద్యార్థులు ఫుట్‌బోర్డు ప్రయాణం చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల బస్సుల ఫీజులు భరించలేక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నామని విద్యార్థులు చెబుతున్నారు. కళాశాలలకు వెళ్లే సమయంలో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అదనపు బస్సులు పెట్టాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకూ అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు బస్సు ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి.

– డి.అనుపమ, గృహిణి, సామర్లకోట

మధ్యలోనే దింపి వేస్తాం



ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు అందరూ కలిసి ఒకే బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. దాంతో బస్సుల్లో వేలాడుతూ ప్రయాణం చేయడాన్ని గమనించాం. దీనిపై విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశాం. ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులను మా సిబ్బంది మధ్యలోనే దింపి వేస్తారు. బస్సు పాస్‌లకు పంచింగ్ విధానం లేకపోవడంతో ఓ బస్సు దిగి మరో దానిలో ఎక్కుతున్నారు.

– అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్సై, సామర్లకోట

పంచారామ క్షేత్రంలో హోమం, గ్రామోత్సవం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో గణపతి హోమం

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలు పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న గణపతి ఆలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వెండి ఆభరణాలతో అలంకరించారు. గణపతి ఆలయం వద్ద గణపతి హోమాన్ని ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం ప్రారంభించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. మూషిక వాహనంపై గణపతి విగ్రహాన్ని ఉంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- సీఐ కృష్ణభగవాన్



వేట్లపాలెంలో ఉత్సవ నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: గణేశ్ మండపాలు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ స్పష్టం చేశారు. గురువారం వేట్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి పలు సూచనలు చేశారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద కమిటీ నాయకులు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా విగ్రహాల నిమజ్జనానికి ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. నిమజ్జనాలకు కేటాయించిన ప్రదేశాల్లో పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు.

తెలుగు భాషకు వన్నె తెచ్చిన గిడుగు



పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తెలుగు భాషా దినోత్సవంలో అపర్ణను సత్కరిస్తున్న విజయ్‌ప్రకాష్

పెద్దాపురం: తెలుగు భాషకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని తెలుగు రాష్ట్రాల ద్విశత అవధాని, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ బలుసు అపర్ణ, ప్రముఖ రచయిత రవి మంత్రి అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, తెలుగు భాషకు వన్నె తెచ్చేందుకు గిడుగు కృషి ఎనలేనిదన్నారు. అడకమిక్ కో-ఆర్డినేటర్ ఎస్.ప్రశాంతి, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ, తెలుగు భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ఏకపాత్రాభినయం, తెలుగు గీతాలు, పోతన భాగవత పద్యాలు, పద్య పఠన, శ్రీశ్రీ ఖండిక ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ జాయింట్ సెక్రటరీ సమీరా, మీడియా కో-ఆర్డినేటర్ ఉషా చైతన్య, ప్రముఖ న్యాయవాది చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

సామర్లకోట: తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో శతక పద్యాలధారణ, జాతీయ గీతాలాపన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అదే విధంగా కబడ్డీ, రన్నింగ్, హైజంప్, మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిగాయి. ఉపాధ్యాయులు జి.బేబీరాణి, పి.దుర్గాప్రసాద్, పీఈటీ పి.సుధారాణి పర్యవేక్షించారు.

రేపు కౌన్సిల్ అత్యవసర సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే పాలక మండలి సర్వసభ్య సమావేశంలో భాగంగా ఈ నెల 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులపై చర్చించేందుకు అజెండాలో 13 అంశాలను పొందుపర్చినట్టు చెప్పారు. సమావేశానికి మున్సిపాలిటీకి చెందిన వివిధ విభాగాల అధికారులు, కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలన్నారు.

మృతుల కుటుంబాలకు గీత పరామర్శ



మూలపేటలో చరణ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ పిఠాపురం ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత పరామర్శించారు. ఇసుకపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జలతరపు నూకరాజు అల్లుడు మృతి చెందగా, వారి కుటుంబాన్ని, నాగులాపల్లికి చెందిన విశ్రాంత రెవెన్యూ అధికారి అనిశెట్టి రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను, పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన మత్స్యకారుడు ఎరిపల్లి నూకరాజు నిజామాబాద్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లి వరద ఉధృతి కారణంగా మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని, మూలపేట ఇందిరా కాలనీకి చెందిన ఏడిద చరణ్ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చరణ్ కుటుంబానికి ఆమె ఆర్థికసాయం అందజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, నాయకులు ఎరకం దివాకర్‌రెడ్డి, గుళ్లపల్లి వీరభద్రరావు, గొర్ల పోతన్న, ఎరకం ప్రసాదరెడ్డి, వడిశెట్టి బుచ్చిరెడ్డి, కారే కిరణ్, కంబాల యాకోబు, గోగు జగన్నాథం, ఏడిద ప్రసాద్, వడిగే కనకేశ్వరావు, అర్జిల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



శిక్షణకు హాజరైన వలంటీర్లు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: పట్టణంలో నిరక్షరాసులు లేకుండా, అక్షరాస్యతను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. ఉలాస్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కాకినాడ జిల్లాను నూరు శాతం అక్షరాస్యులుగా చేసేందుకు సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాసులను గుర్తించి, వలంటీర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. తొలి విడతలో 1,500 మంది నిరక్షరాసులను గుర్తించినట్టు చెప్పారు. వారికి శిక్షణ ఇవ్వడానికి 150 మంది వలంటీర్లను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు చదువు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా అధికారి రవిశంకర్, సీటీ మిషన్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

వీధివీధినా కొలువైన గణనాథుడు

- ఘనంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం



కొత్తపల్లిలో లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కోనపాపపేటలో లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న భక్తులు



కాండ్రకోటలో భక్తులను ఆకట్టుకుంటున్న 19 అడుగుల వినాయక మట్టి విగ్రహం

పెద్దాపురం: గణపతి బప్పా మోరియా అంటూ పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాలు గణపతి నామంతో మార్మోగాయి. నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డు, మున్సిపల్ సెంటర్, పాశిలివీధి, పాత పెద్దాపురం, బొమ్మల గుడి వీధి తదితర ప్రాంతాల్లో గణేశ్ విగ్రహాలను నెలకొల్పారు. మండలంలోని మర్లావ, రాయభూపాలపట్నం, గోరింట, చదలాడ, పులిమేరు, కాండ్రకోట, తాటిపర్తి, దివిలి, చంద్రమాంపల్లి తదితర గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, నిత్య పూజాభిషేకాలు నిర్వహించారు. పెద్దాపురం పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలు వాడాలని పిలుపునిచ్చినప్పటికీ, చాలా చోట్ల కలర్ ఫుల్ వినాయకుడే దర్శనమిచ్చాడు. మర్లావ గ్రామంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఆధ్వర్యంలో నవరాత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు సత్య హరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. తొలుత వినాయక ఆలయంలో గ్రామానికి చెందిన కాతా రాజేష్, గంగాభవాని దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మాజీ వైస్ ఎంపీపీ మిరియాల పద్మరాజు చిత్రపటానికి గ్రామ పెద్దలు నివాళులర్పించారు.

ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్‌లో ఉన్న లక్ష్మీగణపతి విగ్రహానికి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొన్నాడ శివారు కోనపాపపేటలో మత్స్యకారులు ప్రత్యేక గణపతి మందిరాలను ఏర్పాటు చేశారు. మండలంలోని గణపతి ఆలయాల వద్ద స్వామివారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో భారీ గణపతి

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. రైల్వే స్టేషన్, టాక్సీస్టాండ్, ఆటో యూనియన్లు, లారీ స్టాండ్లతో పాటు, ఆయా ముఖ్య కూడళ్లలో గణపతి మండపాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పచ్చల పరిశ్రమ యజమాని గోపాలకృష్ణ 11 అడుగుల మట్టి విగ్రహం నెలకొల్పారు. ఈ విగ్రహాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక ఆటో స్టాండ్, మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు చేశారు. సీతాఫలదొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరీ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఆయా ప్రాంతాల్లోని మండపాల్లో గణపతిని దర్శించుకున్నారు.



పులిమేరులో గణనాథుడు



సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 11 అడుగుల గణపతి మట్టి విగ్రహం



సామర్లకోట గణపతి మండపంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఆవాల లక్ష్మీనారాయణ, రాజేశ్వరి దంపతులు

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా..



జై గణేశ్ ఆలయం వద్ద గ్రామోత్సవం

కనుల పండువగా చవితి ఉత్సవాలు ప్రారంభం

పిఠాపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని గ్రామాల్లోను మండపాలు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో వినాయక నామస్మరణలు హోరెత్తాయి. పిఠాపురం నియోజక పరిధిలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు తదితర మండలాల పరిధిలో సుమారు 250 వినాయక మండపాలు నిర్మించి, చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక కోటగుమ్మం సెంటర్లోని జై గణేశ్ ఆలయంలో నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కాగా, గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు వినాయక దీక్షలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ క్షేత్రంలో వెలసిన చింతామణి గణపతికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు వినాయక ఆలయంలో పూజలు జరిగాయి. స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు.



చింతామణి గణపతి



పిఠాపురంలో భారీ వినాయక విగ్రహం